సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ¦ 7 ¦ మే ¦ 2024



అడ్డు వస్తున్నాడనే..

కడ్తాల్‌లోని మక్తమాదారంలో కాలిన మృత దేహం కేసు మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధమే అని విచారణలో తేలింది. 10లో▸



మళ్లీ మోదీనే ప్రధాని

మళ్లీ మోదీ ప్రధాని కావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి నారాయణలాల్ పంచారియా ధీమా వ్యక్తం చేశారు. 10లో▸



బతికున్న రైతును చంపేసి..

బతికుండగానే మరణించినట్లు ఓ రైతు భూమిని ఇతరులపై పట్టా మార్పిడి చేసిన ఘటనలో కేసు నమోదు చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

ఎన్నికల వేళ తనిఖీలు ముమ్మరం

భారీగా పట్టుబడుతున్న నగదు, బంగారం, మద్యం, గంజాయి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,332 కేసుల్లో రూ.9,39,42,041 కోట్ల నగదు సహా మొత్తం రూ.41,81,11,904 విలువ చేసే బంగారు ఆభరణాలు, మద్యం సీసాలు, డ్రగ్స్ సీజ్ చేశారు. వీటిలో రూ.24, 88,40,388 విలువ చేసే 4,44,639. 8652 గ్రాముల బంగారం, రూ.30,34,700 విలువ చేసే 48,900 గ్రాముల వెండి, రూ.1,50, 00,738 విలువ చేసే 48,810 లీటర్ల మద్యం పట్టుబడింది. రూ.50 లక్షలకుపైగా విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

మోడల్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు షురూ

చేవెళ్ల: తెలంగాణ ప్రభుత్వ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టీనావతి పేర్కొన్నారు. చేవెళ్లలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల విడుదలపై పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ మోడల్ కళాశాలలో చేరాలనుకుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయని తెలిపారు. పదో తరగతిలో 9జీపీఏ పైగా సాధించిన అమ్మాయిలకు హాస్టల్‌వసతి కూడా ఉందని చెప్పారు. మార్కుల మెమో, ఆధార్‌కార్డు, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతోపాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.


స్ట్రాంగ్‌రూంను పరిశీలించిన మహబూబ్‌నగర్ కలెక్టర్



స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్‌రూంను సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి నాయక్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ రిసెప్షన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై ఆర్‌డీఓ వెంకట మాధవరావును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పార్థసారధి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఉన్నారు.

'పట్నం'లో స్ట్రాంగ్ రూం పరిశీలన



స్ట్రాంగ్‌రూంను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న యాదాద్రి కలెక్టర్

ఇబ్రహీంపట్నం: భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం స్ట్రాంగ్‌రూంను సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ జెండగే హనుమంత్ కొండబా సందర్శించారు. ఖానాపూర్ సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూంను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హనుమంత్ అక్కడి పరిస్థితులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి అనంతరెడ్డి ఉన్నారు.

మోదీ రాక.. నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

సనత్‌నగర్: ప్రధాని మోదీ పర్యటన దృష్ట్యా మంగళ, బుధవారాల్లో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 7న (మంగళవారం) రాత్రి 7.50 నుంచి 8.25 మధ్య ప్రధాని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ఎయిర్‌పోర్ట్ వై జంక్షన్, పీ అండ్ టీ ఫ్లైఓవర్ వద్ద యూ టర్న్, షాపర్స్‌స్టాప్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట ఫ్లైఓవర్, గ్రీన్‌ల్యాండ్స్, రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద లెఫ్ట్ టర్న్, మోనప్ప ఐల్యాండ్ జంక్షన్, యశోద హాస్పిటల్, ఎంఎంటీఎస్ మీదుగా రాజ్‌భవన్ చేరుకుంటారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో భాగంగా ఈ నెల 8న (బుధవారం) ఉదయం 8.35 నుంచి 9.10 గంటల మధ్య అదే మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని చెప్పారు.



కడ్తాల్: ఉపాధి హామీ పనులు జరిగే చోటుకు వెళ్లి ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఇతర నాయకులు



షాద్‌నగర్: క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఓట్ల ఫీట్లు.. ప్రచార పాట్లు

ఓటర్లు ఎక్కడుంటే అక్కడికే..

- రద్దీ ప్రాంతాలే ప్రచార అడ్డాలు
- ఉపాధి పని వద్దకు ఉదయపు నడక
- పొలం బాట పడుతున్న నేతలు
- కూలీలు పని చేసే చోట ఓట్ల అభ్యర్థన



షాద్‌నగర్: మిర్చి పంట కోస్తున్న రైతు కూలీల వద్ద బీజేపీ నేతల ప్రచారం

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ప్రచారం ఊపందుకుంది. ప్రధాన పార్టీలకు చెందిన నేతలు ఓట్ల కోసం పాట్లు పడుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వారు ఎక్కడుంటే అక్కడికే వెళ్తున్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న నేపథ్యంలో నేతలు కూలీలు పని చేసే ప్రాంతాలకు వరుస కడుతున్నారు. వారితో కలిసి పని చేస్తూ.. తట్టా, బుట్టా మోస్తూ, కూరగాయలు కోస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

వారికి ఉపాధి.. వీరికి ప్రచార పరమావధి

జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చాలా గ్రామాల్లో కొనసాగుతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలు 8 గంటల వరకే పనులకు వెళ్తున్నారు. ఒక్కో గ్రామంలో సుమారు వంద నుంచి మూడు వందల మంది కూలీలు ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు. చెరువుల్లో పూడిక తీత, కందకాల తవ్వకం వంటి పనులు చేపడుతున్నారు. దీంతో నాయకులు ఉపాధి హామీ పనులు చేపట్టే ప్రాంతాలనే ప్రచార అడ్డాలుగా మార్చుకుంటున్నారు.

ఆట.. ఓట్ల వేట

వేసవి సెలవులు కావడంతో ఉదయం, సాయంత్ర వేళల్లో పట్టణాలు, గ్రామాల్లో క్రీడా మైదానాలు కిటకిటలాడుతున్నాయి. కొందరు వ్యాయామాలు, నడకకు వెళ్తే, యువత క్రికెట్ టోర్నమెంట్లలో నిమగ్నం అవుతోంది. దీంతో నాయకులు క్రీడా మైదానాలను ఎంచుకొని అక్కడికి వెళ్తూ వారితో సరదాగా ఆటలు ఆడుతూ.. వ్యాయామాలు చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో పట్టణ ప్రాంతాల్లో కూరగాయలు, చికెన్, మటన్ దుకాణాల వద్ద ప్రచారాలు నిర్వహిస్తున్నారు.

రైతన్న.. నీ ఓటు మాకేనన్న

యాసంగి పంటలు కోతలు జరుగుతున్నాయి. గ్రామాల్లో చాలా మంది రైతులు వ్యవసాయ పొలాల వద్ద పంట కోతల్లో నిమగ్నమయ్యారు.తెల్లవారింది మొదలు సాయంత్రం వరకు పొలాల వద్దే ఉంటున్నారు.దీంతో నేతలు ప్రచారాల కోసం పొలం బాట పడుతున్నారు. పంట పొలాల వద్దకు వెళ్లి ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి రైతులను కలుస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కృషి చేస్తుందని వారికి హామీల వర్షం కురిపిస్తున్నారు.

పోలింగ్‌ను నిశితంగా పరిశీలించాలి

- కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల్లో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు విధిగా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు వీలుగా నియమించిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగలుగుతారని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీత, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



చేవెళ్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ కళాశాలలో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో చేపట్టిన కమిషనింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి ఆయన పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లలో బ్యాలెట్ పేపర్, అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులను అమరుస్తున్న తీరును పరిశీలించారు. కమిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. ఈవీఎంలను అన్ని విధాలా సిద్ధం చేయాలని.. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా కమిషనింగ్ జరిపించాలని సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, ఇతర అధికారులు ఉన్నారు.

నేను పక్కా లోకల్



'ఇక్కడే చదువుకున్నా.. ఇక్కడే ఉద్యోగం చేశా. ఆఫీసు, ఇళ్లు అన్నీ ఇక్కడే. 40 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా. నేను పక్కా లోకల్. అంగుళం భూమి కబ్జా చేసినట్లు రుజువు చేసినా, ఒక్క మక్క గింజ అక్రమంగా తీసుకున్నట్లు నిరూపించినా.. నా ఆస్తులన్నీ వారికి రాసిచ్చేస్తా' అని చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో తనకు లభిస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేకే ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి మళ్లీ గెలిచేది తానేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'సాక్షితో' ప్రత్యేకంగా మాట్లాడారు.

– సాక్షి, రంగారెడ్డిజిల్లా

40 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా

- భూ కబ్జా నిరూపిస్తే ఆస్తులు రాసిచ్చేస్తా
- ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేకే ఆరోపణలు
- చేవెళ్ల గడ్డపై ఎంపీగా గెలిచేది మళ్లీ నేనే
- నా పని తీరే.. నా విజయానికి కొలమానం
- 'సాక్షి'తో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి

❖ **ప్రచారం ఎలా సాగుతోంది. ప్రజల్లో స్పందన ఎలా ఉంది?**

❖ సీఎం రేవంత్‌రెడ్డితో రోజుకో నియోజకవర్గంలో రోడ్‌షోలు నిర్వహిస్తున్నాం. పార్టీ అభిమానుల నుంచే కాదు, సాధారణ జనం నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ ఎన్నికల్లో మళ్లీ గెలువబోయేదీ నేనే. నా ప్రచారం.. నాకు లభిస్తున్న మద్దతు చూసి తట్టుకోలేక ప్రత్యర్థి అభ్యర్థి నాకు డిపాజిట్ రాదంటున్నాడు. ఎవరికి డిపాజిట్ రాదో త్వరలో తెలుస్తుంది.

❖ **ప్రత్యర్థులు మిమ్మల్ని స్థానికేతరుడిగా ప్రచారం చేస్తున్నారు?**

❖ 1982 నుంచి రాజేంద్రనగర్‌లో చదువుకున్నా. శంషాబాద్‌లో ఉద్యోగం చేశా. ఇక్కడే ఆఫీసు, ఇల్లు ఉంది. బీజేపీ అభ్య ర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆఫీసు ఎక్కడ? ఆయన ఇల్లెక్కడ? ఆయన ఇక్కడ పుట్టడం మినహా ఈ ప్రాంతానికి చేసిందేమిటి? చేవెళ్లతో ఆయన కంటే నాకే ఎక్కువ అవినాభావ సంబంధం ఉంది.

❖ **బీజాపూర్ రోడ్డు విస్తరణపై ఏం చెబుతారు? క్రెడిట్ నాదంటే.. నాదే అంటున్నారు?**


❖ రోడ్డు విస్తరణ పనులు మంజూరు చేయించిందే నేను. ప్రతి దానికి నా వద్ద ఆధారం ఉంది. వారి దగ్గర ఏమైనా ఆధారాలుంటే చూపించమనండి. కొండా ఎంపీగా ఉన్నప్పుడు 60 మీటర్ల రోడ్డుకు దరఖాస్తు మాత్రమే చేశారు. భారీ ట్రాఫిక్ ఉంటుందని కేంద్రం దాన్ని రద్దు చేసింది. డీపీఆర్‌ను మార్చింది. 45 మీటర్ల రోడ్డును మంజూరు చేసింది. భూ సేకరణ దాదాపు పూర్తయింది. కొంత మంది రైతులు కోర్టును ఆశ్రయించడం, రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద చెట్లు ఉండటం, వాటి తొలగింపుపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించడంతో పనుల్లో కొంత జాప్యం జరుగుతోంది.

❖ **బీఆర్‌ఎస్ మీకు సముచిత స్థానం కల్పించినా.. పార్టీని ఎందుకు వీడాల్సి వచ్చింది?**

❖ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాకు రాజకీయంగా భవిష్యత్తు ఇచ్చిన మాట వాస్తవమే. నేను అంతకంటే ఎక్కువ పార్టీ కోసం పని చేశాను. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పలు సర్వేలు చేయించాం. సర్వేల్లో పార్టీ వీక్‌గా ఉన్నట్లు తేలింది. నిజానికి పోటీ చేయకూడదని భావించాను. కేసీఆర్ సహా కేటీఆర్‌కు ఇదే అంశాన్ని వివరించాను. కార్యకర్తలు, అభిమానుల ఒత్తిడితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తికి తలొంచక తప్పలేదు.

❖ **భూకబ్జాలు, దాణా కేసు అంశాన్ని ప్రత్యర్థులు పదేపదే ప్రస్తావిస్తున్నారు. వారికి మీరిచ్చే సమాధానం?**

❖ ప్రతి ఊళ్లో మీటింగ్ పెడుతున్నా. నేను ఒక్క ఇంచు భూమి కబ్జా చేసినట్లు నిరూపించినా.. నా భూములన్నీ రాసిస్తా. ఒక్క మక్క గింజ అక్రమంగా తీసుకున్నట్లు నిరూపించినా.. వారికి నా మొత్తం ఆస్తులు రాసిస్తా. కోడిగుడ్డును కల్తీ చేస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎవరైనా గుడ్డును కల్తీ చేస్తారా? ఎవరెన్ని ఆరోపణలు చేసినా అంతిమ విజయం నాదే.



❖ **ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులేమిటి? మళ్లీ గెలిస్తే ఏం చేస్తారు?**

❖ ఇప్పటికే 111 జీఓ ఎత్తివేయించాను. మన్నెగూడ రోడ్డును మంజూరు చేయించాను. రూ.100 కోట్లతో వికారాబాద్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాం. ఆ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, పరిగి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, శంషాబాద్‌కు రూ.60 కోట్లు, జల్‌పల్లికి రూ.30 కోట్లు మంజూరు చేయించాను. వికారాబాద్‌కు మెడికల్ కాలేజీ మంజూరు చేయించాను. రాజేంద్రనగర్‌కు డిగ్రీ కాలేజీ తీసుకొచ్చాను. కొండాపూర్‌లో ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేయించాను. గెలిచిన తర్వాత అడ్రస్ లేకుండా పారిపోయే వ్యక్తిని కాదు. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటా. పార్టీలకు అతీతంగా ఆపదలో ఎవరు..ఏ రాత్రి ఫోన్ చేసినా స్పందిస్తా.విద్యా, వైద్య పరంగా ఆర్థిక సాయం అందిస్తా.నా పని తీరే కొలమానం.

బీజేపీకి ఆదరణ పెరుగుతోంది

- ఈసారి చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురుతుంది
- బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

చేవెళ్ల: దేశంలో మోదీ ప్రభంజనంతో రాష్ట్రంలో రోజురోజుకూ బీజేపీకి ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలకేంద్రంలో సోమ వారం సాయంత్రం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డపై ఈసారి కాషాయ జెండా ఎగురవేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గ్రామాల్లో బీజేపీ జోరు చూసిన కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. రంజిత్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన కోళ్ల స్కాం, దాణా స్కాంలు ప్రజలందరికీ తెలుసన్నారు. ఫిలింనగర్‌లో హనుమాన్ దేవాలయం కూల్చి వేసిన పాపం రంజిత్‌రెడ్డిని వెంటాడుతోందని, ఆయన ఈఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమన్నారు. అలాంటి వ్యక్తులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. దేశాభివృద్ధికి మోదీలాంటి నాయకుడే కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని కొండా విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. మండలంలోని ప్రొద్దటూరు మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, కొత్తపల్లి ఎంపీటీసీ శోభ తదితరులు విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములు, నర్సింహారెడ్డి, సురేశ్, వాసుదేవ్‌కన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు సంస్కారం ప్రధానం

- వీహెచ్‌పీ దక్షిణమధ్య ప్రాంత సేవాప్రముఖ్ బండారు రమేష్



శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది కాలమానిని ఆవిష్కరిస్తున్న బంగారు రమేష్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: చిన్నారులకు విద్యతోపాటు సంస్కారం, సామాజిక విలువలు నేర్పించాలని విశ్వహిందూ పరిషత్ దక్షిణమధ్య ప్రాంత సేవాప్రముఖ్ బండారు రమేష్ అన్నారు. పట్టణంలోని యోగా కేంద్రంలో సోమవారం సంస్కారభారతి జాతీయ సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ షాద్‌నగర్‌శాఖ ఆధ్వర్యంలో బాలల రంగస్థల నట శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బండారు రమేష్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఒక్కటే ప్రధానం కాదని, సభ్యత, సంస్కారం, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు, తోటి వారిని గౌరవించడం, అభిమానించడం, సహాయం చేయడంవంటి మంచి విలువలను నేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అలాంటి మంచి విలువలను నేర్పించేందుకు పాఠశాలలతో పాటు ఇలాంటి శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. పిల్లలకు చిన్నతనం నుంచే విలువలతో కూడిన సంస్కారం నేర్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు, సంస్కారభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ రంగయ్య మాట్లాడుతూ.. నట శిక్షణా శిబిరంలో చిన్నారులకు నటనలో మెలకువలు, పది మందిలో ధైర్యంగా మాట్లాడగలగడం, భావ వ్యక్తీకరణ, నీతి కథలు, పద్యపఠనం, చిత్రలేఖనం, సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడంవంటి పలు అంశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. నేటి బాలల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఎంతోమంది యువకులు ఉన్నత విద్యావంతులుగా ఉన్నప్పటికీ వేదికమీద తమ భావాలను సరైన సరైన రీతిలో వ్యక్త పరచలేకపోతున్నారని, అందుకు కారణం కేవలం పుస్తకపఠనానికి ఇచ్చిన ప్రాధాన్యత ఆట, పాటలకు ఇవ్వకపోవడమేనని అన్నారు. చిన్నారులకు మన సంస్కృతిని ప్రతిబింబించే సాంప్రదాయ కళలను పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి శిక్షణ శిబిరాలు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం పద్మశ్రీ పురస్కార గ్రహీతల ముఖచిత్రాలతో రూపొందించిన శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది కాలమానిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెజుగం రమేష్, సింగారం శ్రీనివాస్, బాలబ్రహ్మచారి, చెట్ల వెంకటేశ్, రవీందర్, రమేష్‌చారి, వీరేశం, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మోదీనే ప్రధాని



మాట్లాడుతున్న నారాయణలాల్ పంచారియా

కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు నారాయణలాల్ పంచారియా

మొయినాబాద్‌రూరల్: దేశంలో మళ్లీ నరేంద్రమోదీనే ప్రధాని కావడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి నారాయణలాల్ పంచారియా ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలంలో ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఆరు గ్యారంటీల హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయలేదని విమర్శించారు. కానీ కేంద్రంలో కాంగ్రెస్ సర్కార్ వస్తుందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న అందరూ గెలుస్తారని ఆయన జోస్యం చెప్పారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, పదేళ్లలో ప్రజలకు న్యాయమైన పాలన అందించిందన్నారు. మూడోసారి ముచ్చటగా నరేంద్రమోదీ ప్రధానమంత్రి అవుతారని ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు బూత్‌లెవల్ సభ్యులు కష్టపడి గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా నాయకుడు చిలుకూరు గోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మధుసుధన్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమల్లేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు అశోక్, నాయకులు లక్ష్మీపతియాదవ్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, మాధవరెడ్డి, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ రోడ్డు కబ్జాకు యత్నం



కాలనీలకి వెళ్లే దారిని తవ్విన ఆక్రమణదారులు

అధికారులకు ఫిర్యాదు చేసిన కాలనీవాసులు

అబ్దుల్లాపూర్‌మెట్: రోడ్డు ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, హయత్‌నగర్ సీఐకి కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో బృందావన్ హోటల్‌కు ఆనుకుని జాతీయ రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లేందుకు ఆయా లే అవుట్లు చేసిన సమయంలో రోడ్డును వేశారు. ఇటీవల కొంత మంది ఆ రోడ్డును కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ఆపిల్ ఎవెన్యూ కాలనీ అసోసియేషన్, వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకోవడంతో ఆక్రమణదారులు వెళ్లిపోయారు. తాజాగా జాతీయ రహదారి నుంచి కాలనీలకు రాకపోకలు లేకుండా రోడ్డుకు అడ్డంగా గుంతను తవ్వారు. దీంతో కాలనీవాసులు అక్కడికి చేరుకుని అడ్డుకోవడంతో దాడికి యత్నించారు. రోడ్డు ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెండు కాలనీలకు చెందిన ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు సురేష్‌రెడ్డి, నారాయణరెడ్డి వెంకట్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, హరినాథ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.1.6 లక్షల పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. రాగన్నగూడ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్యావ ప్రశాంత్ అనే సెల్స్‌మ్యాన్ వద్ద రూ.1,60,350 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానంతో భార్యను రాయితో మోది

పాశవికంగా హత్య చేసిన భర్త

చేవెళ్ల: కట్టుకున్నోడే కాల యముడు అయ్యాడు. వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఓ భర్త బండరాయితో భార్యను కొట్టి పాశవికంగా మట్టుబెట్టాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి మండలంలోని మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలంలోని ఇంద్రారెడ్డినగర్‌కు చెందిన జల్‌పేట్ మాణిక్యం భార్య యాదమ్మ(45)లు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. యాదమ్మ హౌస్ కీపింగ్ పనికి వెళ్తుంది. భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని గత కొంత కాలంగా గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి వచ్చిన మాణిక్యం అందరూ పడుకున్న తరువాత భార్య యాదమ్మ ముఖంపై బండరాయితో కొట్టి చంపేశాడు. ఉదయం కుటుంబసభ్యులు చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి పరిశీలించి వివరాలు సేకరించారు. భర్తను అదుపులోకి తీసుకొని ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడాది జైలు

యాచారం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఓ వ్యక్తికి రంగారెడ్డి జిల్లా కోర్టు సోమవారం ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధించింది. యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎండీ హఫీజ్ మద్యం తాగి 2006లో అదే గ్రామానికి చెందిన తలారి యాదయ్యను కులం పేరుతో దూషించి కొట్టాడు. యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన యాచారం పోలీసులు ఎండీ హఫీజ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించగా విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం హఫీజ్‌కు ఏడాది జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే..

భర్తను హత్య చేయించిన భార్య
- వీడిన మక్తమాదారంలో కాలిన మృతదేహం మిస్టరీ
- ముగ్గురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి



తాండ్ర రవీంద్ర (ఫైల్)

శంషాబాద్: కడ్తాల్‌లోని మక్తమాదారంలో కాలిన మృతదేహం కేసు మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భార్యనే తన ప్రియుడితో కలిసి భర్త హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారించి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. గత నెల 30 కడ్తాల్ సమీపంలోని మక్తమాదారం బటర్‌ఫ్లై వెంచర్‌లో పూర్తిగా కాలి ఉన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కడ్తాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ సమీపంలో అదే సమయంలో అదృశ్యం కేసు నమోదు కాగా దాని ఆధారంగా పోలీసులు మృతిచెందిన వ్యక్తి నాదర్‌గుల్ బాలాపూర్‌కు చెందిన తాండ్రా రవీంద్ర (45) సెంట్రింగ్ వర్కర్‌గా గుర్తించారు. రవీంద్ర భార్య గీత (31) బాలాపూర్‌లో నివాసముంటున్న డీసీఎం డ్రైవర్ కడారి యాదరగిరితో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని గీత తన ప్రియుడి యాదగిరి కలిసి హత్యకు పథకం వేశారు.

కిడ్నాప్ చేసి..

ఈ నెల 29 సాయంత్రం మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విశాల్ మార్ట్ వద్ద తన భర్త రవీంద్ర ఉన్న సమాచారాన్ని గీత తన ప్రియుడు యాదగిరికి చెప్పింది. దీంతో అతడు బలెనో కారులో తన స్నేహితుడు చిత్రం అనిల్‌కుమార్ (31) కలిసి అక్కడకి వచ్చి బలవంతంగా రవీంద్రను కారులో ఎక్కించుకుని వెళ్లారు. కారులోనే అతడిని విల్‌పానా ఇతర పరికరాలతో విచక్షణ రహితంగా కొట్టారు. మక్తమాదారం బటర్‌ఫ్లై వెంచర్‌కు చేరుకున్న తర్వాత వాటర్‌బాటిల్‌లో తెచ్చిన పెట్రోలు పోసి నిప్పంటించారు. మంటలకు తాళలేక అతడు సమీపంలోనే కుప్పకూలి చనిపోయాడు. అదే రోజు రాత్రి గీత తన భర్త రవీంద్ర అన్నయ్య రఘునందన్‌కు ఫోన్ చేసి చెప్పింది. మరుసటి రోజు సాయంత్రం వరకు ఫిర్యాదు చేయకపోవడంతో ఆమెను వెంటబెట్టుకుని రఘునందన్ మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసుతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్న పోలీసులు వారి నుంచి కారుతో పాటు హత్యకు ఉపయోగించిన పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో అదనపు డీసీపీ రాంకుమార్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, కడ్తాల్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ ఉన్నారు. కేసును చేధించిన కడ్తాల్, ఆమన్‌గల్, షాద్‌నగర్ పోలీసులను డీసీపీ అభినందించడంతో పాటు రివార్డును అందజేశారు.

మండుటెండలో 'ఆసరా' వెతలు

ఆరేళ్లుగా తిరుగుతున్నా పింఛన్ రావడంలేదని వృద్ధుడి ఆవేదన



ఎండలో పింఛన్ కోసం భార్య సహాయంతో కార్యాలయానికి వచ్చిన వృద్ధుడు

మొయినాబాద్: అసలే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటలు దాటిందంటే రోడ్లపైకి రావడానికి జనం జంకుతున్నారు. కానీ ఓ వృద్ధుడు పింఛన్ కోసం అంటూ తన భార్య సహాయంతో సోమవారం మిట్ట మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఆరేళ్లుగా తిరుగుతున్నా పింఛన్ రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల విఠలయ్య వృద్ధాప్య పింఛన్ కోసం ఆరేళ్ల క్రితం దరఖాస్తు చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఆయనకి పింఛన్ మంజూరు కాలేదు. ప్రతి రెండు మూడు నెలలకోసారి మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి అధికారులను అడుగుతున్నారు. వచ్చిన ప్రతిసారి వెబ్‌సైట్ ఓపెన్ అయిన తరువాత మీకు పింఛన్ వస్తుందని అధికారులు చెప్పి పంపుతున్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఎవరూ లేరు. అంతా పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల శిక్షణకు వెళ్లారు. కార్యాలయంలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్‌ను వృద్ధుడు కలిసి తనకు పింఛన్ ఎప్పుడొస్తుందని అడిగారు. వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని.. అది ఓపెన్ అయిన తరువాత పింఛన్ వస్తుందని కంప్యూటర్ ఆపరేటర్ చెప్పడంతో చేసేదేమిలేక అదే ఎండలో నిరాశతో వెనుదిరిగారు.

గల్లంతైన మృతదేహాలు లభ్యం

చెరువు నుంచి వెలికి తీసిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

పహాడీషరీఫ్: చేపలు పట్టేందుకు వెళ్లి జల్‌పల్లి చెరువులో గల్లంతైన ఇద్దరు బాలుర మృతదేహాలను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సోమవారం వెలికితీశాయి. పహాడీషరీఫ్ పోలీసుల వివరాల ప్రకారం.. పాతబస్తీ బార్కాస్‌కు చెందిన అబ్దుల్ వాహెద్(14), ఉస్మాన్ నహదీ(16), హఫీజ్, వసీం, అబుబకర్ నహదీ అనే బాలురు ఆదివారం చేపలు పట్టేందుకు వచ్చి వాహెద్, ఉస్మాన్ నహదీలు గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి గాలించినప్పటికీ లభ్యం కాకపోవడంతో, సోమ వారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలించగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించిన అబ్జర్వర్



ఇండోర్ స్టేడియంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ ప్రియాంక శుక్ల

హుడాకాంప్లెక్స్: జనరల్ అబ్జర్వర్ డా.ప్రియాంక శుక్ల సోమవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మాక్ పోల్, ఈవీఎంల కమిషనింగ్, సింబల్ లోడింగ్, పోస్టల్ బ్యాలెట్ తీరును, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కి సంబంధించి క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన లారీ అసోసియేషన్ సభ్యులు



సీఎంకి శుభాకాంక్షలు తెలుపుతున్న సయ్యద్ సాదిక్

కొందుర్గు: లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా లారీ ఓనర్ల ప్రధాన సమస్యలు తీర్చేందుకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చినట్లు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చారు.

ఎన్నికల కోడ్‌కు సహకరించాలి

సీఐ శంకర్‌కుమార్



కారును తనిఖీ చేస్తున్న సీఐ శంకర్‌కుమార్, పోలీస్ సిబ్బంది

యాచారం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు సహకరించాలని యాచారం సీఐ శంకర్‌కుమార్ కోరారు. యాచారం మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారమే డబ్బులు తీసుకెళ్లాలని సూచించారు. మద్యం తరలింపుపై సైతం నిఘా పెట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

షాద్‌నగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వెలిజర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల, హాజిపల్లి, షాద్‌నగర్ పట్టణంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బెల్టుషాపులపై దాడులు చేపట్టారు. వెలిజర్ల గ్రామంలో రాఘవేందర్ నిర్వహిస్తున్న షాపులో 11.34 లీటర్ల (63 లిక్కరు బాటిళ్లు) మద్యాన్ని స్వాధీనం చేసుకొని షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ.12 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం అమ్మినా, నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద సోమవారం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. రావిర్యాలకు చెందిన టి.శ్రీకాంత్ వద్ద 41 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

బతికున్న రైతును చంపేసి..

భూమిని విరాసతు చేసిన ఘటనలో 9 మందిపై కేసు



పాసుపుస్తకం చూపుతున్న వెంకటయ్య

కొందుర్గు: బతికుండగానే మరణించినట్లు ధ్రువీకరించి ఓ రైతుకు సంబంధించిన భూమిని ఇతరులపై పట్టా మార్పిడి చేసిన కేసులో తొమ్మిది మందిపై జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చేగిరెడ్డిఘనాపూర్ గ్రామ శివారులో గడ్డం వెంకటయ్యకు 30 గుంటల భూమి ఉంది. ఆయనకు కుమారులు మల్లేశ్, నర్సింలుతో పాటు ఓ కుమార్తె ఉంది. రైతుతోపాటు ఆయన వారసులకు తెలియకుండా వెంకటయ్య మరణించినట్లు ఓ అఫిడవిట్ జత చేసి అదే గ్రామానికి చెందిన తిమ్మగళ్ల గాయత్రి, హన్మగళ్ల మమత పేర్లపై సదరు భూమిని విరాసతు చేసి ధరణి పోర్టల్ ద్వారా అధికారులు పట్టా మార్పిడి చేశారు.

గతంలో ఫిర్యాదు

దీనిపై వీరన్నపేట గ్రామానికి చెందిన బాధిత రైతు ఈ ఏడాది ఏప్రిల్ 20న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి తహసీల్దార్ విజయ్ కుమార్‌తోపాటు, పట్టా మార్పిడి చేయించుకున్న గాయత్రి, మమత, స్టాంప్ వెండర్ రఫిక్ ఉద్దీన్, ఇందుకు సహకరించిన జంగయ్య, యాదయ్య, నర్సింలు, సుదర్శన్ తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ఇప్పటికే పట్టా మార్పిడి చేయించుకున్న మమత, గాయత్రిలను అరెస్టు చేసినట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు. త్వరలోనే మిగతా వారిని విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్‌మాదిగ

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్ మాదిగ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలతో నిరుపేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని ప్రకటించిన ప్రధాని మోదీ ఎందుకు వేయలేదని, నల్లధనాన్ని ఎందుకు వెలికి తీయలేదని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో లౌకిక, ప్రజాస్వామ్య కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసర ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య, నాయకులు పెంటయ్య, వెంకటయ్య, నర్సింలు, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో నివాసం ఉంటూ బ్రహ్మణపల్లి సమీపంలో వీరమణి చాక్లెట్ కంపెనీలో ఇమాన్యుల్(22) పని చేస్తున్నాడు. ఆదివారం విధులు పూర్తి చేసుకొని తన బైక్‌పై స్నేహితుడు బసంతపూరి నరేష్‌తో కలిసి తుర్కయంజాల్ వైపు వస్తున్నారు. బ్రహ్మణపల్లి రోడ్డు దాటి రాగన్నగూడ సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటోను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురిని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఇమాన్యుల్ మరణించినట్లు ధ్రువీకరించారు. నరేష్‌కు తీవ్రంగా గాయాలవ్వడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు వివరించారు.

అర్ధరాత్రి ఇళ్లలో చోరీ

ఆమనగల్లు: మండల పరిధిలోని మేడిగడ్డతండాలో ఆదివారం అర్ధరాత్రి మూడు ఇళ్లలో దుండగులు చోరీ చేశారు. తండాకు చెందిన రమేశ్, మరో ఇద్దరు రాత్రి వేళలో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయా ఇళ్లలోకి చొరబడ్డారు. బీరువాలను పగులగొట్టారు. మూడు ఇళ్లలో దాదాపు రెండున్నర తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటిపై నుంచి కిందికి వచ్చి చూడగా, ఇళ్ల తాళాలు పగుల గొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు రమేశ్ ఆమనగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ తండాను సందర్శించి చోరీకి గురైన ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.